దివిసీమలో జలహాసం

- పకడ్బందీగా సాగుతున్న జల్‌జీవన్ మిషన్ పనులు
- అవనిగడ్డ నియోజకవర్గంలో రూ. 14 కోట్లతో పనులు
- 70 శాతానికి పైగా పూర్తయిన పైపులైన్ల నిర్మాణాలు
- తీరనున్న తాగునీటి కష్టాలు


హంసలదీవిలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు


పైపులైన్ పనులు

కోడూరు: సముద్రానికి కూతవేట దూరం.. ఎటు చూసినా ఉప్పునీరే.. తాగునీటి కోసం బిందెలు చేత పట్టి కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి.. కూలీ పనులు మానుకొని పంచాయతీ కుళాయిల వద్ద తాగునీటి కోసం గంటల తరబడి పడిగాపులు.. చివరి బిందె వరకు తాగునీరు పూర్తి స్థాయిలో వస్తుందో రాదో తెలియక కుళాయిల వద్ద నానా హడావుడి.. ఇప్పటి వరకు దివిసీమ ప్రాంత ప్రజలు తాగునీటి కోసం ఇలా పడరాని పాట్లు పడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికి తాగునీటిని అందించాలని సంకల్పించి కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులు మాత్రమే అందించే జల్ జీవన్ మిషన్ పథకానికి పూర్తి స్థాయి నిధులు సమకూర్చి ఇంటింటికి కుళాయి పథకానికి శ్రీకారం చుట్టారు. దీంతో పల్లెల్లో ప్రజలకు నీటి కష్టాలు పూర్తి స్థాయిలో తొలగనున్నాయి.

పకడ్బందీగా పనులు..

అవనిగడ్డ నియోజకవర్గంలో ఆరు మండలాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు పకడ్బందీగా సాగుతున్నాయి. ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.14 కోట్ల నిధులు కేటాయించగా, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. అవనిగడ్డ మండలంలోని నాలుగు గ్రామాల్లో రూ.35.62 లక్షలు, చల్లపల్లిలోని పది గ్రామాల్లో రూ.5.22 కోట్లు, ఘంటసాలలోని 11 గ్రామాల్లో రూ.2.30 కోట్లు, కోడూరులోని ఐదు గ్రామాల్లో రూ.3.24 కోట్లు, మోపిదేవిలోని పది గ్రామాల్లో రూ.1.05 కోట్లు, నాగాయలంకలోని 20 గ్రామాల్లో రూ.1.74 కోట్ల నిధులతో జల్‌జీవన్ మిషన్ పనులు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు పది వేల కుళాయిలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రతి ఇంటిని అనుసంధానం చేస్తూ ..

పైప్‌లైన్ పనులు 70 శాతానికి పైగా పూర్తి చేశారు. ప్రతి ఇంటిని అనుసంధానం చేస్తూ పైపులైన్లను నిర్మించారు. నియోజకవర్గంలో కొత్తగా హంసలదీవి, పిండివానిదిబ్బ, నిమ్మగడ్డ ప్రాంతాల్లో మూడు ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఇంటింటికి కుళాయిని ఇస్తుండగా, గ్రామస్తులకు తాగునీటిని గతంలో ఉన్న ట్యాంకుల ద్వారానే సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కుళాయిలకు సంబంధించిన పైపులైన్‌ను ట్యాంకులకు అనుసంధానం చేస్తున్నారు. ట్యాంకులు లేని ప్రాంతాల్లో నూతన ట్యాంకులను నిర్మిస్తున్నారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని, పనుల్లో పూర్తి స్థాయి నాణ్యత పాటిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు.

తీరప్రాంత ప్రజలకు వరం..

కోడూరు, నాగాయలంక మండలాల్లోని తీరప్రాంత ప్రజల తాగునీటి కష్టాలు వర్ణాతీతం. సముద్రతీర ప్రాంతాలైన హంసలదీవి, పాలకాయతిప్ప, ఊటగుండం, ఇరాలి, బసవానిపాలెం, పిండివానిదిబ్బ గ్రామాల్లో ప్రజలు తాగునీరు దొరక్క సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ద్వారకా, కోడూరు వరకు సైకిళ్లపై వచ్చి తాగునీటిని తీసుకువెళ్లారు. వేసవిలో సమీప పొలాలు, చెరువుల్లో చలమలు తీసుకొని ఆ నీటినే ఉపయోగించుకొనేవారు. నీరు దొరక్క అనేక కుటుంబాలు వలసబాట పట్టాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఇంటింటికి కుళాయి రావడంపై తీరప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనే ఈ పథకం ఉన్నప్పటికీ ఏ ప్రభుత్వాలూ తమను ఆదుకోలేదని, ప్రస్తుతం ఇంటికే తాగునీరు రావడం చాలా ఆనందంగా ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి వద్దే కుళాయి ఏర్పాటు చేశారు



తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నాం. కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లి నీటిని తెచ్చుకొనేవాళ్లం. వేసవి వస్తే తాగునీటి పూర్తిస్థాయిలో దొరక్క అల్లాడిపోయాం. నీరు లేక గ్రామాల్లోని పశువులను కూడా విక్రయించుకున్నాం. సీఎం జగనన్న పుణ్యమా అని ఇంటి వద్దే తాగునీటి కుళాయిని ఏర్పాటు చేశారు. త్వరలోనే కుళాయి ద్వారా నీటిని కూడా అందిస్తామని అధికారులు తెలిపారు. చాలా ఆనందంగా ఉంది.

– పేరే వెంకటేశ్వరరావు, ఇరాలి

ఆనందంగా ఉంది



పంచాయతీ కుళాయిల వద్ద తాగునీటి కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. ఇంటికి కనీసం రెండు బిందెలు నీరు దొరకడం గగనమయ్యేది. పనులు మానుకొని కుళాయిల వద్ద పడిగాపులు పడేవాళ్లం. ఇప్పుడు ఇంటి ఆవరణలో తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేశారు. ట్యాంకు నిర్మాణం పూర్తి కాగానే నీటిని అందిస్తామని చెప్పారు. ఇంటి వద్దే ఉండి కుళాయి నీటిని పట్టుకుంటామని ఎప్పుడు ఊహించలేదు. ఆనందంగా ఉంది.

– గంజాల నాగేశ్వరమ్మ, రామకృష్ణాపురం

రీ సర్వే గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేయాలి

కలెక్టర్ రంజిత్‌బాషా



చిలకలపూడి(మచిలీపట్నం): మార్చి 30వ తేదీ నాటికి జిల్లాలో రీ-సర్వేకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ పి. రంజిత్‌బాషా ఆదేశించారు. సచివాలయం నుంచి గురువారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి. సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.కలెక్టర్ రంజిత్‌బాషా జిల్లాలో ఇప్పటివరకు జరిగిన రీ-సర్వే పురోగతిని వివరించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ కేటగిరీల వారీగా ఇప్పటి వరకు జిల్లాలో 100 గ్రామాలు రీ-సర్వే ప్రక్రియ పూర్తయిందన్నారు. మూడో కేటగిరీలో 61 గ్రామాల్లో రీ-సర్వే జరుగుతోందని, 53 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిందని చెప్పారు. డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, సర్వే శాఖ ఏడీ గోపాలరాజా పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించిన వారిని అడ్డుకున్న పోలీసులు

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి నిర్దేశించిన స్థలంలో నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన వారిని చిలకలపూడి పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. 30 పోలీస్‌యాక్టు అమలులో ఉండగా నిబంధనలు అతిక్రమించిన కారణంగా ముందస్తు చర్యల్లో భాగంగా వారిని అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

ఇంటికే వచ్చి పింఛను ఇస్తున్నారయ్యా

- ఎమ్మెల్యే సింహాద్రి వద్ద లబ్ధిదారుల ఆనందం
- మోపిదేవిలో గడప గడపకు మన ప్రభుత్వం


మహిళకు అందుతున్న పింఛన్ వివరాలు తెలుపుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు


స్థానికుడితో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

మోపిదేవి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంటికే వచ్చి పెన్షన్ సొమ్ములు ఇస్తున్నారయ్యా అంటూ లబ్ధిదారులు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వద్ద ఆనందం వ్యక్తంచేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మోపిదేవి గ్రామ సచివాలయం–1లో మూడో రోజు గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చెప్పిన వన్నీ చేశాము గనుకనే మాకు ఓట్లు వేయాలని కోరుతున్నామని, మీ అందరి దీవెనలతో తిరిగి జగనన్నే ముఖ్యమంత్రి అవుతారని స్పష్టంచేశారు. గ్రామస్తులు రోడ్లు, డ్రెయినేజీ వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారని, వాటిని కూడా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి), ఎంపీటీసీ సభ్యులు కారుమూరి శివనాగరాజు, సనకా వెంకట రాజేష్ బాబు, పీఏసీఎస్ చైర్ పర్సన్లు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

నవరత్న పథకాలతో మా ఇంటికి వెలుగులు

మచిలీపట్నంటౌన్: జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలతో మా ఇంటికి వెలుగులు వచ్చాయని 24వ డివిజన్‌కు చెందిన పోతురాజు నాగలక్ష్మి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం 24వ డివిజన్‌లో జరిగింది. పేర్ని కిట్టు గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాగలక్ష్మి మాట్లాడుతూ తనకు జగనన్న అమ్మఒడి రూ. 29 వేలు, వైఎస్సార్ పింఛను కానుక రూ. 50,750 మొత్తం రూ. 79,750లతోపాటు ఇంటిస్థలం, పక్కా గృహం మంజూరయ్యాయని ఆనందం వ్యక్తంచేసింది. అదే ప్రాంతానికి చెందిన చెరుకూరి సునీత మాట్లాడుతూ తనకు వివిధ పథకాలకు సంబంధించి మొత్తం రూ. 85,343లతో పాటు ఇంటి స్థలం, పక్కా ఇల్లు మంజూరయ్యాయని వివరించింది. కిట్టు మాట్లాడుతూ రాష్ట్రంలోని బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. కార్పొరేటర్ చిత్తజల్లు ప్రసన్న, డివిజన్ ఇన్‌చార్జి చిత్తజల్లు రాజు, డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి పాల్గొన్నారు.

జగనన్న కాలనీలు దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు


లబ్ధిదారులకు కరెంట్ మీటర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

పులిగడ్డ(అవనిగడ్డ): మన రాష్ట్రంలో అమలు జరుగుతున్న జగనన్న కాలనీల నిర్మాణాలు దేశానికే ఆదర్శనీయమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. పులిగడ్డ జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ సౌకర్యాన్ని ఎమ్మెల్యే సింహాద్రి గురువారం ప్రారంభించి మాట్లాడారు. గతంలో చంద్రబాబు హయాంలో ఏర్పాటు చేసిన కొన్ని లేఅవుట్లకు ఇప్పటికీ సరైన సదుపాయాలు లేవన్నారు. సీఎం జగన్ పాలనలో ముందుగానే రహదారులు, తాగునీటి వసతి, మెరక పనులు చేసి అన్ని సౌకర్యాలు సమకూర్చిన తరువాతనే ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. దేశంలో ఎక్కడా ఇలాంటి విధానం అమలు కావడం లేదన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే కరెంట్ మీటర్లను అందజేశారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ దాసరి విజయకుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, హౌసింగ్ డీఈ భానునాయక్, ఏఈ సురేంద్ర పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి చెరువు పరిశీలన

కోడూరు: వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. లింగారెడ్డిపాలెం శివారు జరుగువానిపాలెం రక్షిత మంచినీటి చెరువును ఎమ్మెల్యే గురువారం పరిశీలించి మాట్లాడారు. చెరువులను ప్రక్షాళన చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు రాతలపై ఆగ్రహం

ఈనాడు ప్రతులు దహనం


అవనిగడ్డలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు


బందరులో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అవనిగడ్డ: టీడీపీ నాయకుడు పట్టాభిని కొట్టారు అంటూ ఈనాడు దిన పత్రిక తప్పుడు రాతలపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనికి నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి వంతెన సెంటర్ వరకు నాయకులు ర్యాలీగా వెళ్లి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఎదుట ఈనాడు ప్రతులను దహనం చేశారు. ఈనాడు విషపు రాతలు నమ్మొద్దు అంటూ నినాదాలు చేశారు. నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు కోసం ఈనాడు దిగజారుడు రాతలు రాస్తోందని విమర్శించారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, పట్టణ కన్వీనర్ అన్నపరెడ్డి రాందాస్, ఏపీ అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నా, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, ఉప సర్పంచ్ కోడూరు సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ గాజుల జయగోపాల్, నాయకులు సింహాద్రి రామనాథబాబు పాల్గొన్నారు.

అసత్య కథనాలతో చంద్రబాబుకు వత్తాసు..

కోనేరుసెంటర్: ఈనాడులో వస్తున్న అసత్య కథనాలను ఖండిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పార్టీ కార్యాలయం వద్ద ఈనాడు ప్రతులను దహనం చేశారు. వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా మాట్లాడుతూ పత్రికలు సమాజహితం కోసం పాటుపడాలే తప్ప ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉండకూదని హితవు పలికారు. రాష్ట్రంలో అసత్య కథనాలే ఆయుధంగా ఈనాడు దినపత్రిక తెలుగుదేశం పార్టీకి కొమ్ము కాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, తుమ్మలపల్లి జగన్నాథం, మట్టా తులసమ్మ, కార్పొరేటర్ పల్లి శేఖర్, ఐనం తాతారావు, మాచవరపు రాంప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


సంచార పశు వైద్యశాలతో ఇంటి వద్దకే సేవలు


సంచార పశు వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ చినబాబు

బంటుమిల్లి: బంటుమిల్లి డివిజన్ పశుసంవర్ధక శాఖకు ప్రభుత్వం మంజూరు చేసిన డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాన్ని ఎంపీపీ వి. చినబాబు గురువారం ప్రారంభించారు. స్థానిక ఆస్పత్రి ఏడీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పశువులకు కూడా అత్యవసర సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని, రైతులకు వ్యవసాయంతోపాటు పశువుల సంరక్షణ భారం కాకుండా సంచార వైద్య సేవలు సకాలంలో అందుతాయని చెప్పారు. ఏడీ డాక్టరు కె. బాబూరావు మాట్లాడుతూ ప్రజలు 1962కు ఫోన్ చేస్తే వాహనం రైతుల ఇంటి ముందుకు వస్తుందన్నారు. అన్నిరకాల మందులు, సిబ్బంది వాహనంలో అందుబాటులో ఉంటాయని అత్యవసర సేవలకు వైద్యులు ఆన్‌లైన్‌లో సేవలందిస్తారని వివరించారు. ప్రమాదాలకు గురై నడవలేని పశువులను హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా వ్యక్తులతో పని లేకుండా వాహనంలోకి ఎక్కించి మెరుగైన వైద్యం కోసం రూపాయి ఖర్చు లేకుండా పెద్దాస్పత్రికి తరలించే సౌకర్యం ఉండటం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ఎంపీటీసీలు ఎండీ కమాల్‌బాషా, అలీం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం. రాజబాబు పాల్గొన్నారు.

తీరం వెంట గస్తీ పటిష్టం చేయాలి

మెరైన్ డీఎస్పీ శ్రీనివాసులు


సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

కోడూరు: సముద్రతీరం వెంట గస్తీని మరింత పటిష్టం చేసి, అపరిచిత వ్యక్తులపై నిఘాను పెంచాలని మెరైన్ డీఎస్పీ జి.శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం పాలకాయతిప్ప మెరైన్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హంసలదీవి సాగరతీరానికి నిత్యం వేలాదిమంది పర్యాటకులు వస్తుంటారని, తీరం వెంట సిబ్బంది గస్తీ నిర్వహించాలని డీఎస్పీ సూచించారు. వేటకు వెళ్లే మత్స్యకారులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు సముద్రంలో వేట సమయంలో అనుమానిత బోట్లు కనిపిస్తే వెంటనే స్టేషన్‌కు సమాచారం ఇచ్చేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆదేశాలను అనుసరించే మత్స్యకారులు వేటను కొనసాగించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మెరైన్ సిబ్బంది కూడా నిత్యం తనిఖీలు చేపట్టాలని డీఎస్పీ సూచించారు. తీరప్రాంత గ్రామాల్లో మాక్‌డ్రిల్ నిర్వహణ, అవగాహన సదస్సులు వంటిని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీఐ పవన్‌కిషోర్, ఎస్ఐ జిలానీ, రైటర్ రెహ్మాన్ జానీ పాల్గొన్నారు.

నేడు హుసైన్ దినోత్సవం

మచిలీపట్నంటౌన్: ప్రవక్త హజ్రత్ మొహమ్మద్ ముస్తఫా రెండో మనుమడు హజ్రత్ ఇమామ్ హుసైన్ అలైహిస్సలామ్ జన్మదినం కార్యక్రమాన్ని హుసైన్ డే గా శుక్రవారం రాత్రి స్థానిక కోనేరుసెంటర్‌లో నిర్వహిస్తామని ఉత్తరప్రదేశ్‌కు చెందిన గ్లోబల్ పీస్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ స్వామి సారంగ్ మోహిలీ తెలిపారు. హుసైన్ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గురువారం మచిలీపట్నం విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. హుసైన్ డే ఏ మతానికి, ఏ కులానికి సంబంధించింది కాదని, మానవత్వానికి సంబంధించిందని చెప్పారు. హుసైన్ జీవిత విశేషాలను శుక్రవారం రాత్రి 7.30 గంటలకు కోనేరు సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో వివరిస్తామన్నారు. హుసైనీ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్ అలీబేగ్, అక్తర్ అబ్బాస్, ఆర్థిక కార్యదర్శి షంస్ అబ్బాస్ పాల్గొన్నారు.

పూర్తి సమాచారంతో హాజరుకావాలి

పెడన: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి పూర్తి సమాచారంతో సమయానికి హాజరుకావాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కె. సుబ్బారావు అన్నారు. జింజేరు సచివాలయంలో సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జింజేరులో త్వరలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ లబ్ధిదారులను నేరుగా కలుస్తారని చెప్పారు. సిబ్బంది ప్రభుత్వ పథకాల సమాచారం అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

రాగి పిండి అందజేత

మచిలీపట్నంటౌన్: ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్‌కు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ రాగిపిండి, బెల్లంపొడిని గురువారం అందజేశారు. సత్య సాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆరోగ్యంతో కూడిన విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనంతో పాటు పాఠశాలలకు వచ్చిన వెంటనే విద్యార్థులకు రాగిజావ అందించే కార్యక్రమం చేపడుతున్న దృష్ట్యా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 11.5 టన్నుల రాగి పిండి, 11.5 టన్నుల బెల్లంపొడిని ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్ ఎస్ఎస్ జల్లాకు అందజేశామన్నారు. సమితి కన్వీనర్ ఆంజనేయకుమార్, వై. సాయిబాబు, పి. వరప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటింటా నాంచారమ్మకు పూజలు

కోడూరు: భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి గ్రామోత్సవంలో భాగంగా చిన్నఅమ్మ వారికి భక్తులు ఇంటింటా పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం విశ్వనాథపల్లి గ్రామంలో కాపు కులస్తుల ఇళ్ల వద్ద గ్రామోత్సవం నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ అమ్మవారిని ప్రతి ఇంటికి తీసుకువెళ్లి హారతులు పట్టారు. భక్తులు గుండుదీపాలు, గారెల దండలతో చలువబట్టలపై నడుచుకుంటూ వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. ఇళ్ల వద్ద సహపంక్తి భోజనాలు చేశారు. ఆడపడుచులు కూడా గ్రామానికి తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది.

తండ్రి కలలను సాకారం చేసిన కుమారుడు

కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపిక


సాయిజగదీష్ (కుమారుడు)


చలపతిరావు (తండ్రి)

కృత్తివెన్ను: పోలీసు శాఖలో ఆయనొక సాధారణ హెడ్ కానిస్టేబుల్. తన కొడుకును ఉన్నత ఉద్యోగంలో చూడాలని కలలు కన్నాడు. తండ్రి కలలు సాకారమయ్యేలా కుమారుడు కష్టపడి చదివాడు. ఫలితంగా కుమారుడు ఇన్‌స్పెక్టర్ కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ జీఎస్టీగా ఎంపికయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కృత్తివెన్ను పోలీస్ స్టేషన్ పరిధిలో హెడ్ కానిస్టేబుల్‌గా తులం చలపతిరావు పనిచేస్తున్నాడు. ఆయన కుమారుడు తులం సాయి జగదీష్ 2019లో బీటెక్ కంప్యూటర్ సైన్స్ జేఎన్‌టీయూలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. కేంద్రప్రభుత్వ ఉద్యోగం కోసం పట్టుదలతో చదివి 2020లో సీజీఎల్ పరీక్షను రాశాడు. దేశవ్యాప్తంగా 20 లక్షల మంది అభ్యర్థులు పోటీపడిన ఈ పరీక్షలో 750 ర్యాంకు సాధించడంతో ఇన్‌స్పెక్టర్ కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ జీఎస్టీగా ఎంపికై తండ్రి కలలను సాకారం చేశాడు. జగదీష్ విద్యాభ్యాసాన్ని గుడివాడ, విజయవాడ, కాకినాడలలో పూర్తి చేశాడు. ఇటీవల కేంద్ర మత్స్యశాఖ మంత్రి మురుగన్ చేతులమీద అపాయింట్‌మెంట్ ఆర్డరు తీసుకుని చెన్నైలోని పల్లవరం డివిజన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా చార్జ్ తీసుకున్నారని ఆయన తండ్రి తెలిపారు. నేడు సెంట్రల్ కస్టమ్స్ అండ్ ఎక్సైజ్ డే కావడంతో ఆయన తల్లితండ్రులు తులం చలపతిరావు, కన్యాకుమారి ఆనందం వ్యక్తంచేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థానంలో జరగనున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు గురువారం శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఉదయం 7.51 గంటలకు నూతన విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో శాంతి పూజలు, విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజా, అభిషేకాలు నిర్వహించారు.

క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ



చల్లపల్లి: రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందడం బాధాకరమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఇటీవల మచిలీపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎంసీఏ విద్యార్థి అద్దంకి గణేష్ మృతిచెందగా.. స్థానిక లైబ్రరీ రోడ్డులో వారి కుటుంబాన్ని పరామర్శించారు. స్థానిక రాధానగర్‌కు చెందిన షేక్ బాబ్ జాన్ లోన్ యాప్ వేధింపులతో విజయవాడలో ఆత్మహత్య చేసుకుని మృతిచెందగా అతని కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకానాథ్, పాగోలు మాజీ సర్పంచ్ పైడిపాముల వెంకటేశ్వరరావు, సీహెచ్‌సీ డైరెక్టర్ అబ్దుల్ కరీం, జిల్లా ఎస్సీ నాయకులు మద్దాల వీరాస్వామి, మైనార్టీ నాయకులు షేక్ నసీంఫెహరీ, అబ్దుల్ కమాల్, ఏఎంసీ డైరెక్టర్ అబ్దుల్ అర్షద్, యడ్ల జగదీష్ పాల్గొన్నారు.

ఎంయూడీఏ వీసీ రాజ్యలక్ష్మి బాధ్యతల స్వీకారం



చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంయూడీఏ) వైస్ చైర్మన్‌గా కె. రాజ్యలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు వీసీగా కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక డెప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న బీవీ నారాయణరెడ్డి ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. ఎంయూడీఏ వీసీగా కె. రాజ్యలక్ష్మిని ఇటీవల మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ నియమించింది. ఈ నేపథ్యంలో ఆమె కలెక్టర్ పి. రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు.

మట్టి ఖర్చులకు సాయం



పెడన: జయలక్ష్మీ పీఏసీఎస్ సభ్యుడు లింగం ప్రసాద్ ఇటీవల మృతిచెందాడు. మట్టి ఖర్చుల కింద రూ. 10 వేలను ప్రసాద్ కుటుంబ సభ్యులకు సొసైటీ చైర్మన్ వరుదు రామకృష్ణ, మేనేజరు హరిబాబు గురువారం అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ కారుపర్తి రాము, రవి, సముద్రయ్య పాల్గొన్నారు.

ఫస్ట్ ఎయిడ్‌పై విద్యార్థులకు అవగాహన



పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డ రెసిడెన్షియల్ స్కూల్‌లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో గురువారం సోపాన్ టెస్టింగ్ క్యాంప్ కార్యక్రమం జరిగింది. క్యాంప్ అధికారి డి. నాగేశ్వరరావు ఫస్ట్ ఎయిడ్, మ్యాపింగ్, కంపాస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయకులు వీరకుమార్, పద్మజారాణి, వెంకటకుమారి, వరకుమార్, భాస్కరరావు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వైవీ రావు



మచిలీపట్నంటౌన్: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని మచిలీపట్నం డిపో యూనియన్ నాయకులు అన్నారు. గురువారం సాయంత్రం బస్టాండ్ వద్ద ఉన్న సంఘ కార్యాలయంలో వైవీ రావు చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ వైవీ రావు మృతి కార్మిక వర్గానికి తీరని లోటని చెప్పారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి లింగం ఫిలిప్, ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి రాజేష్ యాదవ్, రీజియన్ కార్యదర్శి వైవీ రావు, జాయింట్ సెక్రటరీ డి. కృష్ణ, మాజీ అధ్యక్షుడు సుంకర రాఘవరావు, గ్యారేజీ కార్యదర్శి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.